బెంగళూరుకు విస్తరించిన సిడ్స్ ఫార్మ్

హైదరాబాద్ : తెలంగాణా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ప్రీమియం డి2సి డెయిరీ బ్రాండ్ అయినా సిడ్స్ ఫార్మ్ తన కార్యకలాపాలను బెంగళూరుకు విస్తరించినట్లు వెల్లడించింది. ఇకపై అక్కడి పలు ఇ-కామర్స్ వేదికల్లో తమ పాలు, పన్నీర్, పెరుగె, నెయ్యి, వెన్న తదితర ఉత్పత్తులు లభ్యం కానున్నాయని ఆ సంస్థ సోమవారం తెలిపింది. దాదాపు ఎనిమిది కోట్ల మంది జనాభా కలిగిన బెంగళూరులో అత్యుత్తమమైన బ్రాండ్లలో ఒకటిగా సిడ్స్ ఫార్మ్ నిలువనుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు, ఎండి డాక్టర్ కిశోర్ ఇందుకూరి విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లాగానే బెంగళూరు వాసులను సైతం ఆకట్టుకోగలమని ఆయన పేర్కొన్నారు.

టిఆర్ఎస్ అవినీతిపై చర్యలెందుకు తీసుకోవడం లేదు?

- బిజెపిని ప్రశ్నించిన పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'టిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని బిజెపి నాయకులు పదే పదే ఆరోపణలు చేసే ఆరోపణలు చేస్తుంటారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం చర్యలు తీసుకోదు. ఎందుకంటే ఆ రెండు పార్టీలు ఒక్కటే...' అని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నాలుగు బొగ్గు గనులను కేంద్రం ప్రయివేటీకరణ చేస్తోందని టిఆర్ఎస్ ఆరోపిస్తోందన్నారు. వాస్తవంగా సింగరేణిలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమో దం ఉండాలని పొన్నం స్పష్టం చేశారు. తాడిచెర్ల గనుల ప్రయివేటీకరణను రద్దు చేసి సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అక్కడి బొగ్గు గనులను జెన్కో ద్వారా ఎఎంఆర్ కంపెనీకి గుట్టు చప్పుడు కాకుండా 30 ఏళ్ల పాటు అప్పజెప్పడంలో సిఎం కెసిఆర్ కుటుంబ సభ్యులు వేలకోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతి జరుగుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నా అందులో 49 శాతం వాటా ఉన్న కేంద్రం ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై సిబిఐ, ఇడికి, బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.

కిషన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే

రూ.20 వేల కోట్ల అవినీతి జరిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఈ బొగ్గు గనుల కేటాయింపుపై దర్యాప్తు సంస్థలతో విచారణకు అదేశించాలని సవాల్ చేశారు. రోశయ్య సిఎంగా ఉన్నప్పుడు ప్రయివేటీకరణ వద్దన్న టిఆర్ఎస్ ఇప్పుడెలా కేటాయిస్తున్నదని ప్రశ్నించారు. ఆ గనుల కేటాయింపును రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సహజ వనరులను కాపాడేందుకు కాంగ్రెస్ పోరాడుతుందని తెలిపారు.

దాడులకు భయపడం

ప్రజాస్వామ్య రక్షణకు దేశవ్యాప్త ఉద్యమం : ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమం తరహాలోనే దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య రక్షణకు కవులు, రచయితలు, విద్యార్థులు, ఉద్యోగులను ఏకం చేసి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. దేశవ్యాప్తంగా జాగృతిని విస్తరించేందుకు త్వరలో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. హైదరాబాద్ ముషీరాబాద్‌లోని మహ్మదీయ ఫంక్షన్ హాల్‌లో సోమవారం తెలంగాణ జాగృతి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 2006లో తెలంగాణ జాగృతి ప్రారంభమైందని, 18 దేశాల్లో జాగృతి కమిటీలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జాగృతి ఆధ్వర్యంలో అనేక చర్యలు చేపట్టామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరిత ధోరణి వల్ల హక్కులను కోల్పోతున్నామని, తెలంగాణ యువతీ, యువకులు దేశం కోసం ఆలోచించాలన్నారు. ఎన్నికలకు ఏడాదిన్నర మాత్రమే ఉందని.. దేశవ్యాపంగా ప్రజలను ఏకం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి రాష్ట్రానికీ వెళ్లి ప్రజలను జాగృతం చేయాలన్నారు. ప్రధాని మోడీ పాలనలో దళిత విద్యార్థులకు దేశంలో ఎక్కడా స్కాలర్‌షిప్ ఇవ్వడం లేదన్నారు. తెలంగాణలో బాసర ఐఐటి విద్యార్థులు ఆందోళన చేస్తే విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి వారి వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించారని చెప్పారు. ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియాను నేడు బిజెపి ప్రయివేటు ఎస్టేట్‌గా మార్చివేసిందన్నారు. భావజాల వ్యాప్తి చేసే జాగృతి వంటి సంస్థలు దేశానికి అవసరం అని చెప్పారు.

దాడులకు భయపడేది లేదు..

బిజెపి వైఫల్యాలను ఎత్తిచూపే వారిని ఇబ్బందులకు గురిచేసే విధంగా దర్యాప్తు సంస్థలతో కేంద్ర ప్రభుత్వం దాడులు చేయిస్తున్నదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులకు భయపడేది లేదని, ఐ డోంట్ కేర్ అని అన్నారు. ఇది కేవలం తనపై జరుగుతున్న దాడి మాత్రం కాదని కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షులు రాజీవ్ సాగర్, వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి నవీనచారి, కవి, రచయిత దేశపతి శ్రీనివాస్, తెలంగాణ ఉద్యోగాల సంఘం నాయకుడు దేవిప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

- కాంట్రాక్ట్ లెక్చరర్స్ సంకల్ప ఆశీస్సుల యాత్ర విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరగా పూర్తి కావాలని కోరుతూ చేపట్టిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ సంకల్ప ఆశీస్సుల యాత్ర విజయవంతమైంది. ఈ నెల 10వ తేదీ నుంచి సిద్దిపేట జిల్లా గజ్వేల్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర సోమవారం నంగునూరు మండలం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి వినతిపత్రాన్ని స్వామివారి పాదాలు ముందు పెట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి రమణారెడ్డి, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగులు, లెక్చరర్ల బాధలను ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు పెద్ద మనసుతో, మానవతా దృక్పథంతో 2016లో జీవో నెంబర్ 16 ద్వారా క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. అనివార్య కారణాలవల్ల కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ఇంతవరకు జరగలేదన్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరగా కాంట్రాక్టు లెక్చర్లందరి క్రమబద్ధీకరణకు సీఎం పూనుకోవాలని కోరుతూ ఆయన ఇష్టదైవం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. మూడోరోజు పాదయాత్ర సిద్దిపేటలోని లక్ష్మీనరసింహ టెంపుల్ నుంచి నాంచార్‌పల్లి, వెల్కటూరు నుంచి నంగునూరు మండలం కోనాయిపల్లి వెంకటస్వామి దేవాలయం వరకు చేరింది.

'గ్రీన్‌ఫీల్డ్' ఆందోళన

- జిల్లా పరిషత్ ముట్టడి.. పోలీసులు, రైతుల తోపులాట
- జడ్‌పిలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం.. స్వల్ప ఉద్రిక్తత
- అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని పట్టుబట్టిన రైతులు
- మద్దతుగా నిలిచిన సిపిఎం, సిపిఐ, ప్రజాపంథా



కలెక్టరేట్ వద్ద నిరన తెలుపుతున్న నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగపూర్- అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితులు మరోమారు రోడ్డెక్కారు. అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని ఏళ్లుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కొద్దిరోజులుగా మరింత ఉధృతంగా నిరసనలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు కలెక్టరేట్ ముట్టడించారు. గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ విపి గౌతమ్ జిల్లా పరిషత్‌లో ఉండటంతో జడ్‌పికి వెళ్లేందుకు నిర్వాసిత రైతులు ప్రయత్నించారు. ఖమ్మం ఆర్‌డిఒ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి వైరారోడ్డు మీదుగా జడ్‌పికి చేరుకున్నారు. జడ్‌పిలోకి వెళ్తున్న నిర్వాసితులను పోలీసులు అడ్డుకోవడంతో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. నిర్వాసితులకు అఖిలపక్షాల రైతుసంఘాలు మద్దతుగా నిలిచాయి. అలైన్‌మెంట్ మార్చాల్సిందేనంటూ రైతులు పెద్దపెట్టున నినదించారు. అఖిలపక్షాల నేతలు, రైతులు ఇదే డిమాండ్‌తో ఆందోళన చేపట్టారు.

కోదాడ- కొరవి రోడ్డుకు అనుసంధానించాలి: అఖిలపక్షాల నేతలు

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితుల ఆందోళనకు సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా నేతలు మద్దతు తెలిపారు. ఆందోళనలో భాగంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సంగబత్తుల నవీన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర రైతుసంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు, సిపిఎం, ప్రజాపంథా జిల్లా కార్యదర్శులు నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఖమ్మం నగర అభివృద్ధికి ఆటంకంగా మారిన అలైన్‌మెంట్‌తో గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించేందుకు యత్నిస్తోందన్నారు. విలువైన పంటభూములు, ఇండ్లస్థలాల మీదుగా రోడ్డు నిర్మిస్తే రైతులు, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. కోదాడ- కొరవి రోడ్డుతో దీన్ని అనుసంధానించి అమరావతి- హైదరాబాద్ హైవేతో కలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించిన పర్యావరణం అభిప్రాయ సేకరణలోనూ నిర్వాసితులు ముక్తకంఠంతో వ్యతిరేకించినా.. ఇవేవీ పట్టించుకోకుండా పర్యావరణానికి వ్యతిరేక అభిప్రాయం ఎక్కడ వ్యక్తం కాలేదని అధికారులు నివేదించడం సరికాదన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి అలైన్‌మెంట్ మార్పునకు కృషి చేయాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌కు వినతిపత్రం సమర్పించారు. సిఐలు రామకృష్ణ, సర్వయ్య బందోబస్తు నిర్వహించారు. ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, చింతకాని, ఎర్రుపాలెం, ఖమ్మం అర్బన్ తదితర మండలాల నుంచి నిర్వాసిత రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆందోళనకు మద్దతు తెలిపిన వారిలో ఆయా రైతుసంఘాల నాయకులు పోటు ప్రసాద్, మాదినేని రమేష్, కొండపర్తి గోవిందరావు, ఆవుల వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు ఆవుల అశోక్, దొండపాటి రమేష్, యర్రా శ్రీనివాస్, సలాం, మీరాసాహెబ్, గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసిత జెఎసి నాయకులు తదితరులు ఉన్నారు.

21 నుంచి సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభ

- 23న సిద్దిపేటలో భారీ బహిరంగసభ
- హాజరు కానున్న కేరళ కార్మిక శాఖ మంత్రి వి శివన్‌కుట్టి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు రాష్ట్ర నాలుగో మహాసభలు ఈ నెల 21,22,23 తేదీల్లో సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరుగబోతున్నాయని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు, సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ప్రకటించారు. 23న సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్య అతిథులుగా కేరళ కార్మిక శాఖ మంత్రి వి శివన్‌కుట్టి, సిఐటియు జాతీయ అధ్యక్షులు కె హేమలత, తదితర నేతలు పాల్గొంటారని, ఆ సభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌వి రమ, భూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు కూరపాటి రమేష్, పుప్పాల శ్రీకాంత్, యాటల సోమన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ యూనియన్ మహాసభలను సిద్దిపేటలో మల్లుస్వరాజ్యం నగరలో 600 మంది ప్రతినిధులతో నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్రంలోని కార్మికుల స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, మూడేళ్ల కాలంలో సిఐటియు నిర్వహించిన పోరాటాలు, సమ్మెలను సమీక్షించి భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేస్తామన్నారు. షెడ్యూల్ పరిశ్రమల జిఒల జారీ, ఇప్పటికే విడుదల చేసిన జీవోలను గెజిట్ చేయడం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించడం, అసంఘటిత రంగంలోని బిడి, భవన నిర్మాణం, హమాలీ, ప్రయివేటు, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సమగ్ర శాసనం, పబ్లిక్ సెక్టార్‌లో పని చేసేవారికి పని భద్రత, మౌలిక వసతులు తదితర కార్మికుల సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. మొదటి రోజు మహాసభను సిఐటియు జాతీయ అధ్యక్షులు కె హేమలత, జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ప్రారంభిస్తారని తెలిపారు. అఖిల భారత కేంద్రం నుంచి మహాసభల పరిశీలకులుగా జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు హాజరవుతారని చెప్పారు. 23న జరిగే బహిరంగ సభకు పారిశ్రామిక, కార్మిక వాడల నుంచీ, ప్రతి గ్రామం నుంచీ ఉద్యోగులు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

హింస లేని సమాజం కోసం పోరాడాలి

- మహిళల పట్ల మను ధర్మశాస్త్రాన్ని అమలు చేస్తున్న బిజెపి :సెమినార్‌లో ఎస్ పుణ్యవతి
- పాలకుల విధానాల ఫలితమే స్త్రీలపై దాడులు : మల్లు లక్ష్మి



సెమినార్‌లో మాట్లాడుతున్న పుణ్యవతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హింస లేని సమాజం కోసం పోరాడక తప్పదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ నాయకులు ఎస్ పుణ్యవతి చెప్పారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన సోమవారం 'అవరోధాలను అధిగమిద్దాం-సమసమాజాన్ని నిర్మిద్దాం' అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ ఆధునిక కాలం అని చెప్పబడుతున్న నేటి సమాజంలో మహిళలపై దేశంలో రోజూ ఒక చోట లైంగిక వేధింపులు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్ల పేరుతో స్త్రీని విలాస వస్తువుగా చూసే దుస్థితి నెలకొందన్నారు. మను ధర్మశాస్త్రం స్త్రీలకు ఎలాంటి స్థానం కల్పించిందో, వారి పట్ల ఎలాంటి భావాన్ని కలిగి ఉందో..నేటికి అవే విధానాలు వారి పట్ల కొనసాగుతున్నాయని చెప్పారు. పురుషాధిక్యతా సమాజం మహిళనెప్పుడూ బానిసగానే చూస్తోందని తెలిపారు. వారిని రెండో తరగతి పౌరులుగా చూపించేందుకు పుక్కిటి పురాణ గాథలను రకరకాల రూపంలో వివరిస్తారని చెప్పారు. సనాతన ధర్మాలను ప్రవచించే పండితులు, పురుషాధిక్య భావాజాలకులు స్త్రీలపై నోటి దురుసుతనాన్ని చూపిస్తున్నారన్నారు. సమాజ పురోగమనానికి ఆటంకంగా ఉన్న మనుధర్మశాస్త్రాన్ని బిఆర్ అంబేద్కర్ నాడు తగుల బెట్టారని గుర్తుచేశారు. ఆ చర్య ఈ కాలంలో జరిగితే ఆయన్ను బిజెపి పాలకులు జైల్లో పెట్టేవారని చెప్పారు. బ్రహ్మ నాలుగు వర్ణాలను పుట్టిస్తే..అందులో పాదాలనుంచి పుట్టిన శూద్రజాతిపై మూడు వర్ణాలకు సేవచేయాలని ఆ శాస్త్రం ప్రభోదించిందని తెలిపారు. నిజమైన సంపదన సృష్టించే వారంతా కుల, గోత్ర, నీతి, నిజాయితీ లేనోళ్లగా ముద్ర వేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ధోరణులు ఈ మధ్యకాలంలో మరింత ఎక్కువగా కనిస్తున్నాయని చెప్పారు. వీటికి వ్యతిరేకంగా పోరాడటమంటే..కుల, మత తారతమ్యాలు లేకుండా పోరాడటమేనని చెప్పారు. ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలకు స్వతంత్ర్యం, సమానత్వం పేపర్లోనే కనిపిస్తున్నాయని చెప్పారు. రోజురోజుకు భద్రత కరవుతున్నదన్నారు. బడికి పోయిన పాప తిరిగి ఇంటికి వచ్చే వరకు తల్లి ఆందోళనతో ఎదురు చూడాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొన్నదని చెప్పారు. ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారి నుంచి పండు ముదుసలిపై లైంగిక దాడులు జరుగుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. వీటిపై పండితులైన గరికపాటిలాంటి వారు ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. పైగా అంహకార పూరిత వ్యాఖ్యానాలు చేసి వార్తల్లో వ్యక్తులుగా ఉంటున్నారన్నారు. రాందేవ్ బాబా వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని చెప్పారు. అయినా ప్రజా ప్రతినిధులెవ్వరూ ఇది తప్పని చెప్పక పోవటం బాధగా ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్త్రీలపై అనుచిత వ్యాఖ్యలు, లైంగిక దాడులు, హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు. దేశం విద్యా, వైద్యం తదితర రంగాల్లో పొరుగు దేశాలకంటే వెనుకబడి ఉన్నా..స్త్రీలపై దాడుల్లో ముందున్నామని చెప్పారు. దుర్ఘటన జరిగిన ప్రతిసారీ ప్రభుత్వాలు కంటితుడుపు చర్యలు చేపట్టడం తప్ప మూలాల్లోకి వెళ్లడం లేదని విమర్శించారు. టీవీల్లో వస్తున్న బహుభార్యల సీరియళ్లు గృహ హింస పెరగడానికి తావిస్తున్నాయన్నారు. మరోపక్క మహిళలు బయటకు రాకూడదని, దుస్తులు సరిగ్గా వేసుకోకపోవడం వల్లే ఆడపిల్లలపై దాడులు జరుగుతున్నాయిని మనువాద భావజాలం కలిగిన బీజేపీ కేంద్రమంత్రులు వ్యాఖ్యానిస్తున్నా రని విమర్శించారు. 'భారతమాతకు జై' అన్నవారే స్త్రీలను కించపరచడం దాని రెండు నాలుకల ధోరణికి అద్దం పడుతున్నదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు హింసలో మొదటి వరసలో వున్నాయని గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. ప్రతి గంటకు దేశ వ్యాప్తంగా నలుగురి మహిళలపై లైంగిక దాడులు, ప్రతి పది నిమిషాలకు ఒక కిడ్నాప్ జరుగుతున్నదని వివరించారు. ఉన్న మహిళా రక్షణ చట్టాలను తగిన రీతిలో అమలు చేయకుండా నీరుకారుస్తున్నారని తెలిపారు. ఆధునిక స్త్రీ చరిత్రను తిరిగి రాస్తుందన్న గురజాడ మాటలు నిజం కావాలనీ, మహిళలు, విద్యార్థులు, మేధావులు, అభ్యుదయవాదులు కలసికట్టుగా హింస లేని సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. జస్టిస్ వర్మ సిఫార్సులను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్నెట్‌లలో వస్తున్న విష సంస్కృతిని, పోర్న్ చిత్రాలను నిషేధించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి హైమావతి, బుగ్గవీటి సరళ, కెఎన్ ఆశాలత, ఇందిరా, పాలడుగు ప్రభావతి, భారతి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

- ఎల్ఐసి ఎఒఐ రాష్ట్ర మహాసభలో ప్రధాన కార్యదర్శి డా. పిజి దిలీప్



మహాసభలో మాట్లాడుతున్న దిలీప్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎల్ఐసి ఏజెంట్లు తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేయాలని ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) ప్రధాన కార్యదర్శి డా పిజి దిలీప్ అన్నారు. ఖమ్మం నగరంలోని మంచికంటి భవన్‌లో ఎల్ఐసి ఎఒఐ తెలంగాణ రాష్ట్ర రెండో మహాసభ రాష్ట్ర అధ్యక్షులు లింగా ప్రభాకర్‌రావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎల్ఐసి ఏజెంట్లకు గడ్డుకాలమని, ఇప్పుడు ఐఆర్‌డిఎఐ ప్రవేశపెట్టిన "డ్రాఫ్ట్ బీమా సగం" ద్వారా ఎల్ఐసి ఏజెంట్స్ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నెల తొమ్మిదిన ఐఆర్‌డిఎఐ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేసిన అందరికీ ఆల్ ఇండియా కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్ష కార్యదర్శులు ఎల్ మంజునాథ్, పిఎల్ నరసింహారావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే ప్రక్రియను పోరాటాలతోనే ఎదుర్కోగలమని తెలిపారు. ఎల్ఐసి కార్పొరేషన్‌కు బదులు కంపెనీగా మారే అవకాశం ఉన్నందున దీని ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుందన్నారు. మహాసభలో సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణ వెంకటేశ్వర్లు, ఎల్ఐసి ఎఒఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొయ్యాడ రామయ్య, జోనల్ ఉపాధ్యక్షులు నాగరత్నం, జోనల్ కోశాధికారి జివివిఎస్ఆర్‌కె చారి, ఆహ్వాన సంఘం నిర్వహకులు శ్రీను, మల్లికార్జునరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.

నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఎల్ఐసి ఎఒఐ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జె వెంకటేశ్, అధ్యక్షులు ఎస్‌విఎన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టి నాగరత్నం, ప్రధాన కార్యదర్శిగా తన్నీర్‌కుమార్, కోశాధికారిగా కొత్తపల్లి రామనర్సయ్యతో పాటు 35 మంది కమిటీ సభ్యులు, 58 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

తొమ్మిది కోట్ల మాదక ద్రవ్యాల పట్టివేత

- అంతర్జాతీయ ముఠాలోని ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బట్టల ఎగుమతుల పేరుతో గుట్టుచప్పుడు కాకుండా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న అంతర్జాతీయ ముఠాలోని ఇద్దరిని మల్కాజ్‌గిరి ఎస్ఒటి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి రూ. తొమ్మిది కోట్ల విలువైన 8.5 కిలోల సూడోఫెడ్రిన్‌తోపాటు డ్రగ్స్ తూకం వేసే యంత్రం, పాస్‌పోర్టు, ఆధార్‌కార్డు, రూ.4,02,500, పది సెల్‌ఫోన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బట్టల ఎగుమతి చాటున తమిళనాడు నుంచి హైదరాబాద్, పూణె మీదుగా అస్ట్రేలియా, న్యూజిలాండ్‌కు సింథటిక్ డ్రగ్ సరఫరా చేస్తున్నారు. సోమవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు సిపి సుధీర్‌బాబుతో కలిసి సిపి మహేష్‌భగవత్ వివరాలు వెల్లడించారు.తమిళనాడుకు చెందిన మహ్మద్ కాసీమ్, రసుల్‌దీన్ మలేషియా తదితర దేశాలకు వెళ్లి ఎలక్ట్రానిక్స్ గూడ్స్(స్మగుల్‌గూడ్స్) తక్కువ ధరకు తెచ్చి విక్రయించేవారు. ఈ క్రమంలో 2013లో రసుల్‌దీన్‌కు అతని స్నేహితుడు ఇబ్రహీం కలిశాడు. డ్రగ్స్‌తో కూడిన సూట్‌కేసును మలేషియాకు స్మగ్లింగ్ చేస్తే లక్ష రూపాయలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నాడు. దాంతో రసుల్ దానిని మలేషియాకు తీసుకెళ్తుండగా మధురై ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. దాంతో మూడు నెలలు అతను జైల్లో ఉన్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితుడైన కాసీమ్‌తోపాటు ఫరీద్, ఫైజల్‌ను డ్రగ్ స్మగ్లింగ్‌లోకి దింపాడు. వీళ్లంతా ఇతర దేశాలు తిరుగుతూ స్మగుల్ గూడ్స్ తెచ్చి విక్రయాలు చేస్తున్నారు. విదేశాల్లో వివిధ ప్రాంతాలపై అవగాహన ఉండటంతో చెన్నైలో సుడో ఎఫిడ్రిన్ సింథటిక్ డ్రగ్‌ను తయారు చేసి వాటిని బట్టలు, గాజులు, పిల్లల గిఫ్ట్ ప్యాకెట్లలో ప్రత్యేకంగా ఒక పొరను తయారు చేసి అందులో ప్లాస్టిక్ కవర్లలో 80 నుంచి 100 గ్రాములు నింపి పంపుతున్నారు. ఇలా నింపిన వాటిని హైదరాబాద్‌లోని జీవీఆర్ ఇంటర్నేషనల్ కొరియర్ సర్వీసెస్, పూణెలోని ఇండోఫైన్ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ద్వారా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు పంపిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు హైదరాబాద్ నుంచి ఎనిమిది, పూణె నుంచి ఏడు సార్లు 70 కిలోల సూడో ఎఫిడ్రిన్‌ను ఈ ఏడాది ఎగుమతి చేశారు.

నాలుగు రోజుల కిందట చెన్నైలో రహీమ్ ద్వారా సింథటిక్ డ్రగ్‌ను అందుకున్న కాసీమ్, రసుల్‌దీన్ బస్సులో వివిధ కంపెనీలకు చెందిన బట్టలు లుంగీలు, పంచెలు, షర్ట్‌తో కూడిన ప్యాకెట్లతో హైదరాబాద్‌కు వచ్చారు. లాడ్జీ గదిలో తమతో తెచ్చుకున్న రామరాజ్ కాటన్ బట్టలకు సంబంధించిన ప్యాకెట్‌లకు పైనా, కింద ఒక పొరను తొలగించి అందులో డ్రగ్స్‌ను నింపుతున్నారు.విశ్వసనీయ సమాచారంతో పోలీసులు సంయుక్తంగా దాడి చేసి కాసీమ్, రసుల్‌దీన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఫరీద్, ఫైజల్, రహీమ్ పరారీలో ఉన్నారు.

జాతీయ రహదారిపై బస్సు బోల్తా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్గొండ జిల్లా నకిరేకల్ శివారులోని 65వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నర్సింగ్ కళాశాల విద్యార్థినులు ప్రయాణిస్తున్న బస్సును వెనక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 15 విద్యార్థినులకు గాయాలయ్యాయి. వారిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రైల్వేలోని ఖాళీ పోస్టులు భర్తీ చేయండి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న 3,15,823 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఖాళీల్లో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 17,134 పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ విషయాలను రాజ్యసభలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడించారని సోమవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన నలుగురు బిజెపి ఎంపీలు ఈ ఖాళీల భర్తీని ఎందుకు పట్టించుకోవట్లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నోటిఫికేషన్స్ జారీ చేస్తూ ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

కల్వకుంట్ల కుటుంబానికి ప్రజలే వాతపెడతారు

- రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్వకుంట్ల కుటుంబానికి కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన ట్వీట్ చేశారు. అరచేతిలో వైకుంఠం చూపించడంలో కెసిఆర్ ఆరితేరిపోయారని విమర్శించారు. ఒక వాసాల మర్రిమిటి... మొత్తం తెలంగాణ కెసిఆర్ మాయ మాటలతో మోసపోయిందని తెలిపారు. ఎనిమిదేళ్లుగా కెసిఆర్ మాటలు వినీ వినీ ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు.

మహిళా పోలీసు అభ్యర్థులకు పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మహిళా పోలీసు అభ్యర్థులకు సోమవారం నిర్వహించాల్సిన దేహదారుఢ్య పరీక్షలు వాయిదా పడ్డాయి. వర్షం కారణంగా పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ అదనపు డిసిపి షమీర్ మాట్లాడుతూ.. వర్షం కారణంగా పరీక్షల నిర్వహణకు మైదానం అనుకూలంగా లేదన్నారు. సోమవారం జరగాల్సిన ఈవెంట్స్‌ని వచ్చే ఏడాది జనవరి 4వ తేదీన తిరిగి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సోమవారం దేహదారుఢ్య పరీక్షలకు సుమారు 1200 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. సోమవారం ఉదయం కొంత మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి అయిందని డిసిపి పేర్కొన్నారు.


హెచ్‌ఎంఎను సందర్శించిన డిఫెన్స్ అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(హెచ్‌ఎంఎ)ను డిఫెన్స్ అధికారుల బృందం సోమవారం సందర్శించింది. ఉన్నత రక్షణ నిర్వహణ కోర్సులో భాగంగా హెచ్‌డిఎంసికి ఎనిమిది మంది కోర్స్ ఆఫీసర్స్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్ టూర్ చేపట్టారు. తొమ్మిది మంది ఆర్మీ, నలుగురు ఎయిర్‌పోర్స్, ఇద్దరు నేవీ సీనియర్ అధికారులు హెచ్‌ఎంఎకు వచ్చారు. కోర్సు పాఠాల్లో భాగంగా ప్రయివేటు, ప్రభుత్వ రంగ సంస్థల నిర్వహణ ఎలా చేయాలో ఈ సందర్భంగా అధ్యయనం చేశారు. దీనికి కెప్టెన్ నారాయణన్, కెప్టెన్ హరినాథ్ నాయకత్వం వహించారు. హెచ్‌ఎంఎ అధ్యక్షులు రాంచందర్ 58 ఏళ్ల అసోసియేషన్ గురించి, నిర్వహణ గురించి డిఫెన్స్ అధికారుల బృందానికి పలు విషయాలను వివరించారు. విద్యార్థుల గ్రాస్ రూట్ నుంచే సంస్థల గురించి నేర్చుకోవాలని సూచించారు. హెచ్‌ఎంఎకు అనేక అవార్డులు వచ్చినట్టు చెప్పారు. ఈ సంవత్సరం 50 ఏండ్ల ఉత్సవాలను జరుపుకోనున్నట్టు తెలిపారు. హెచ్‌ఎంఎ క్యాంపస్, కార్పొరేట్ల మధ్య వారధిగా ఉంటుందన్నారు.

దగ్గు నివారణకు లీ హెల్త్ ఔషధం

హైదరాబాద్: ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ లీ హెల్త్ డొమెయిన్ కొత్తగా వాసా తులసి ప్లస్ పేరుతో దగ్గు నివారణకు ఆయుర్వేద ఔషధాన్ని మార్కెట్లోకి విడుదల చేసింది. ఔషధం తయారీలో వైద్య పరంగా నిరూపితమైన సహజ పదార్థాలు వాము పువ్వుతోపాటు ప్రిమ్ రోజ్, తాలీస పత్రం, వస, తులసి, శొంఠి, దుష్టపు తీగ, అతి మధురం, పిప్పళ్లు, దాల్చిన చెక్క, లవంగం, నల్ల మిరియాలు, పుదీనా వాడినట్లు ఆ సంస్థ తెలిపింది. శ్వాస తీసుకోవడంలో ఉన్న ఇబ్బందులను వాసా తులసి ప్లస్ తొలగిస్తుందని లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ లీలా రాణి తెలిపారు. ఆస్తమా, దగ్గు, జలుబు, కోరింత దగ్గు, ఈసినోఫీలియా, గొంతు నొప్పి, బొంగురు గొంతు, సైనసైటిస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. అన్ని ప్రముఖ మందుల దుకాణాలు, లీ హెల్త్ డొమెయిన్ వెబ్‌సైట్, అమెజాన్‌లో వాసా తులసి ప్లస్ లభిస్తుందన్నారు.



ఆన్‌లైన్ పని విధానం రద్దు చేయాలి

- సంగారెడ్డి కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్వాడీలతో చేయిస్తున్న ఆన్‌లైన్ పని విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేకే భవన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌ను ముట్టడించారు. వందలాది మంది అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినదించారు. గంటల తరబడి గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న జయలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల నిర్వాహణలో భాగంగా 14 రకాల రికార్డులను నమోదు చేస్తుండగా ఆన్‌లైన్ పని ఎందుకని ప్రశ్నించారు. స్మార్ట్‌ఫోన్‌లో రాత్రి, పగలు తేడా లేకుండా ఫొటోలు, వివరాల్ని నమోదు చేయాల్సి రావడం వల్ల పని ఒత్తిడి పెరిగి టీచర్లు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానం పేరిట అంగన్వాడీలను రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. పోరాటాల ఫలితంగా తాత్కాలికంగా నిలిపి వేసినప్పటికీ ఆ ప్రమాదం తప్పదన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి మాదిరిగా తెలంగాణలోనూ అంగన్వాడీలను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కర్నాటక మాదిరిగా ఇక్కడా హెల్త్ సదుపాయం కల్పించాలన్నారు. 2015 నుంచి అంగన్వాడీలకు టీఏ, డీఏలు చెల్లించడం లేదన్నారు. పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న వేతనం అంగన్వాడీలు నెలంతా తిరిగే సమావేశాలు, శిక్షణా కార్యక్రమాల ఖర్చులకే సరిపోతుందని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఆరోగ్య లక్ష్మీ పథకం గురించి గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను ఎందుకు పెంచట్లేదని ప్రశ్నించారు.



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్వాడీలతో మాట్లాడుతున్న జయలక్ష్మి

పిల్లలకు రూ.5, గర్భిణులు, బాలింతలకు రూ.10 చొప్పున ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను టీచర్లుగా పిలుస్తున్నామని చెప్పిన సిఎం కెసిఆర్ స్కూల్ టీచర్లతో సమానంగా వేతనాలు, ఇతర సదుపాయాల్ని ఎందుకు కల్పించట్లేదని ప్రశ్నించారు. 45 ఏండ్లుగా అంగన్వాడీలు పని చేస్తున్నా వాళ్ల సీనియారిటీకి గుర్తింపు లేదన్నారు. పంజాబ్‌లో ఆన్‌లైన్ పని విధానాన్ని రద్దు చేశారన్నారు. తెలంగాణలో కూడా ఆన్‌లైన్ పనిని రద్దు చేసే వరకు సిఐటియు ఆధ్వర్యంలో ఉధృతమైన ఉద్యమం చేపట్టనున్నట్టు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు మాట్లాడుతూ.. అంగన్వాడీలు పోరాడిన ఫలితంగా రూ.పది వేల నుంచి రూ.13,500 వేతనం పెంచుకున్నామన్నారు. మరో మారు సమరశీలంగా ఉద్యమించి కనీస వేతనం రూ.26 వేలను సాధించుకోవాల్సిన అవసరముందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు సేవలందిస్తున్న టీచర్లు, వర్కర్ల శ్రమను గుర్తించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు.

ప్రభుత్వాల మెడలు వంచైనా ఆన్‌లైన్ పని విధానాన్ని రద్దు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శశికళ, మంగ, నాయకులు షేకమ్మ, విజయలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు యాదయ్య, విద్యాసాగర్, అంగన్వాడీ నాయకులు జయమ్మ, నాగమణి, చంద్రమణి, సుజాత, రాణి, సువర్ణ, లక్ష్మీ, అలివేణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితపై అక్రమ కేసులు

రాజకీయ కుట్రే

- వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజకీయ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్నదని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ కే వాసుదేవరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారంనాడాయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ మద్యం కేసులో ఏ సంబంధం లేని కల్వకుంట్ల కవితపై బలవంతంగా అభియోగాలు మోపుతున్నారనీ, అందులో భాగంగానే సిబిఐ, ఇడి, ఐటి కేసులు బనాయించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీ మద్యం కేసుతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ చెప్పారనీ, అలాంటప్పుడు కవితకు ఏం సంబంధమని ప్రశ్నించారు. కావాలనే సిఎం కుటుంబాన్ని బద్నాం చేస్తూ, బెదిరిస్తున్నదని చెప్పారు. తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సాక్ష్యాలతో సహా అడ్డంగా దొరికిన స్వాములు కోర్ట్ స్టేతో తిరుగుతున్నారన్నారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌కి 41సిఆర్‌పి కింద నోటీసులు జారీ చేస్తే కోర్టు స్టే తో చట్టాలను అడ్డం పెట్టుకొని హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్నారని విమర్శించారు.

ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- రంగారెడ్డి డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిచో సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామంటూ సోమవారం రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట రంగారెడ్డి జిల్లా ఆశావర్కర్లు సుమారు 400 మంది ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకొని వారికి కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. ఇటీవల ఆశాలకు లెప్రసీ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, అయితే క్షేత్రస్థాయిలో ఈ సర్వేలో ఆశావర్కర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మగవారిని సర్వే చేయడంలో ఆశావర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్కూటమి డబ్బాలు ఆశాలతో మోపించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి నుంచి నిర్వహించే కంటి వెలుగు పనికి అదనంగా డబ్బులు చెల్లించాలని కోరారు. గతంలో ఆశాలు నిర్వహించిన లిప్రాసి కంటి వెలుగు సర్వేలకు పెండింగ్‌లో ఉన్న డబ్బులు వెంటనే చెల్లించాలని తెలిపారు. ఆశాలకు పని భారం, ఉన్నత అధికారుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పక్క రాష్ట్రం ఏపీలో ఇస్తున్నట్టు స్థిరవేతనం నిర్ణయించాలని కోరారు. కరోనా రిస్క్ అలవెన్స్ 16 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న ఆశాల ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం డిఎంహెచ్‌ఓకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని డిఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. వచ్చే నెల నుంచి జిల్లాలో ఉన్న ఆశావర్కర్లకు రూ.9,600 జీతం ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. లెప్రసీ సర్వే మగవారికి తప్పనిసరి కాదని, స్కూటమి డబ్బాలను ఆశాలతో మోపించే విధానాన్ని రద్దు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సునీత, అధ్యక్షులు కవిత, సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్, సాయిబాబా, దేవేందర్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్, కురుమయ్య, ఆశావర్కర్లు అనిత, వసంత, సుజాత, పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బిలో భారీ కసరత్తు

- పునర్వ్యవస్థీకరణతో నూతనోత్సాహం
- ప్రగతిభవన్ కేంద్రంగా ఎలక్ట్రికల్ సబ్‌డివిజన్
- ఢిల్లీ నుంచి మంత్రి రాగానే జిఓలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ పునర్వ్యవస్థీకరణకు భారీ కసరత్తు జరుగుతున్నది. గత శనివారం నాటి క్యాబినెట్ భేటీలో ఆర్‌అండ్‌బిలో అధికార వికేంద్రీకరణ జరగాలంటూ అదనంగా పోస్టులు మంజూరుచేస్తూనే నిధులు సైతం కేటాయించడం ఇందుకు కారణం. దీంతో శాఖ పునర్వ్యవస్థీకరణ కోసం ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారు. ఆ శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజుతోపాటు ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు గణపతిరెడ్డి, రవీందర్‌రావు ఇరువురు శాఖాపరంగా అధికారులతో భేటీలు ప్రారంభించారు. విస్తృత సంప్రదింపులు చేస్తున్నారు. జిల్లాల నుంచి ఎస్‌ఈలు, సిఈలను పిలిపించి సోమవారం హైదరాబాద్‌లో వరుస సమావేశాలు నిర్వహించారు. భవనాలతోపాటు రాష్ట్ర రోడ్లకు సంబంధించి అధికార వికేంద్రీకరణ ఎలా ఉండాలనే అంశాలపై చర్చించారు. ప్రక్రియ దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్టు సమాచారం. ఢిల్లీలో బిఆర్ఎస్ ఆఫీసు కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రాగానే దీనికి ముగింపు పలికే అవకాశాలు ఉన్నాయి. అప్పుడే జీవోలు సైతం జారీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. సిఎంతోపాటు ఢిల్లీకి వెళ్లిన ప్రశాంత్‌రెడ్డి ఇప్పటికే సిఎం ఆదేశాల మేరకు ఓ దఫా ఉన్నతాధికారుతో వికేంద్రీకరణపై చర్చించినట్టు తెలిసింది. ఈమేరకు కిందిస్థాయిలో చర్చించి చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఆ నేపథ్యంలో కార్యదర్శి శ్రీనివాసరాజు భవనాల విభాగం అధికారులతో తొలుత భేటీ అయ్యారు. అనంతరం రోడ్ల విభాగం అధికారులతోనూ సమావేశమయ్యారు. పెరిగిన పోస్టులు 472 కాగా, వాటిని ఎక్కడా, ఎలా సర్దుబాటు చేయాలనే విషయమై లోతుగా చర్చించారు. ప్రజారవాణాను పటిష్టం చేసేందుకు రాష్ట్రంలోని రోడ్లకు మరమ్మత్తులు చేయాలని సిఎం కెసిఆర్ ఆదేశించిన సంగతి తెలిసిందే. అంతేగాక గత మంత్రివర్గ సమావేశంలోనే రూ.635 కోట్లు కేటాయించారు. అలాగే 472 అదనపు పోస్టుల్లో కొత్తగా మూడు సిఇ, 12 ఎస్‌ఈ, 13 ఈఈ, 102 డిఈఈ, 163 ఏఈఈ, 28 డివిజనల్ అకౌంట్స్ అధికారులతోపాటు టెక్నికల్, నాన్‌టెక్నికల్ సిబ్బంది పోస్టులున్న విషయం విదితమే. వీటిని జిల్లాల్లో ప్రాంతాల వారీగా, హైదరాబాద్‌లో పని ఆధారంగా పరిశీలించి పోస్టులను కేటాయించాలని ఉన్నతాధికారులు ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చారు. అలాగే ఇప్పటికే సర్వీసులో ఉన్న సీనియర్ ఇంజినీర్లు, అధికారులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని మంత్రివర్గం ఆదేశించిన తరుణంలో ఆ కసరత్తు కూడా ప్రారంభమైంది. భవనాలు, రోడ్లు, జాతీయ రహదారులకు సంబంధించిన విభాగాల్లో మూడు సీఈ, 10 సర్కిల్, 13 డివిజనల్, 79 సబ్ డివిజనల్ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే క్యాబినెట్ అంగీకరించింది. ఈ తరుణంలో ఆర్‌అండ్‌బిలో ప్రగతిభవన్ కేంద్రంగా ఎలక్ట్రికల్ సబ్‌డివిజన్‌ను ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులు ప్రతిపాదించారు. ఒకవైపు ఈ కసరత్తు జరుగుతుండగానే, మరోవైపు భిన్నమైన వ్యాఖ్యానాలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. పోస్టుల పెంపు ఒక ఎత్తయితే, నిధులను సమకూర్చడం కూడా కీలకమేనని అంటున్నారు. 'ఎంత పని అయినా చేయడానికి సిద్ధం, అసలు కావాల్సింది సొమ్ములు' అని అభిప్రాయపడుతుండటం కొసమెరుపు.

హైదరాబాద్ - ఖమ్మం ర్యాలీని విజయవంతం చేయాలి


- టిటిడిపి అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుదేశం తెలంగాణ శాఖ పార్లమెంటరీ నియోజకవర్గాల సమీక్ష సోమవారం హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు పి . సాయిబాబా , మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు అశోక్ కుమార్ గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సుభాష్ యాదవ్, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు నెల్లూరు దుర్గాప్రసాద్‌తో ఆయా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డిసెంబర్ 21న ఖమ్మంలో జరిగే బహిరంగ సభ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు చేపట్టనున్న ర్యాలీలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారని తెలిపారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని లోక్‌సభ నియోజకవర్గాల పార్టీ అధ్యక్షులకు సూచించారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను, అభిమానులను ఖమ్మం బహిరంగ సభకు తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు . ఈ ర్యాలీ దారి పొడవునా పార్టీ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు భారీగా ఏర్పాటు చేసి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు ఘనంగా స్వాగతం పలకాలని కోరారు. అసెంబ్లీ, డివిజన్ స్థాయిల్లో కూడా పార్టీ ముఖ్య నాయకులను సమన్వయం చేసుకుని ర్యాలీతోపాటు ఖమ్మం బహిరంగ సభను సక్సెస్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజునాయక్ , చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



నాయకులతో సమీక్షిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్



దూసుకెళ్తున్న తెలంగాణ స్టార్టప్‌లు..!

- టెక్ కంపెనీలకు రెండో అతిపెద్ద కేంద్రం
- టి-హబ్ నుంచి తొలి ప్రయివేటు రాకెట్
- టై సమ్మిట్‌లో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

టెక్నలాజీ, స్టార్టప్ కంపెనీల్లో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన టై గ్లోబల్ సమ్మిట్ 2022లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 50 రంగాల్లో 6500 పైగా స్టార్టప్‌లు ఉన్నాయన్నారు. అంతరిక్షయానానికి సంబంధించి దేశంలోనే తొలి ప్రయివేటు రాకెట్‌ను ఇక్కడి టి హబ్ నుంచే స్కైరూట్ తయారు చేసిందన్నారు. నగరంలోని టిహబ్, వుయ్ హబ్, రిచ్, టాస్క్, ఎమర్జింగ్ టెక్నలాజీ తదితర సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా ఔత్సాహికవేత్తలను తయారు చేస్తున్నాయని మంత్రి గుర్తు చేశారు.

"వచ్చే ఏడాది కల్లా రాష్ట్రంలో 1400 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఉత్పత్తి కానున్నాయి. ఇది ప్రపంచం వ్యాక్సిన్ ఉత్పత్తిలో సగం. ప్రస్తుతం 900 కోట్ల వ్యాక్సిన్ల ఉత్పత్తి జరుగుతుంది. మొత్తం మానవాళికి కావాల్సిన వ్యాక్సిన్లలో మూడింటిలో ఒక వంతు తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్నాయి. దేశ జనాభాలో తెలంగాణ ప్రజలు 2.5 శాతం ఉండగా.. స్థూల దేశీయోత్పత్తిలో 5 శాతం వాటాను కలిగి ఉన్నాము. గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం 130 శాతం పెరిగింది. ఇదే సమయంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి అమాంతం పెరిగింది. ఐటి ఎగుమతుల్లో 250 శాతం, వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలు 119 శాతం చొప్పున పెరిగాయి." అని మంత్రి కెటిఆర్ తెలిపారు.

" టెక్నలాజీ ప్రపంచంలో హైదరాబాద్ డీ అంటే డీ అని పోటీ పడుతోంది. అన్ని టెక్ కంపెనీల రెండో అతి పెద్ద క్యాంపస్‌లు ఇక్కడే ఉన్నాయి. అగ్రశ్రేణి -5, 10, 20 ఏ టెక్నలాజీ కంపెనీలను తీసుకున్నా.. హైదరాబాద్‌లో దాదాపు తమ రెండో అతిపెద్ద కార్యాలయాన్ని కలిగి ఉన్నాయి. టాప్-10 గ్లోబల్ ఈకోసిస్టమ్‌లో చౌకగా నైపుణ్యం లభించే నగరాల్లో టాప్ 10లో ఉన్నాము. ఫండింగ్‌లో టాప్-15లో నిలిచాము. బలమైన స్టార్టప్ ప్రగతిలో తెలంగాణ టాప్‌లో ఉందని డిపిఐటి గుర్తించింది. నీతి ఆయోగ్ ప్రకటించిన ఇండియా ఇన్నోవేషన్ సూచీలో నాలుగో స్థానంలో ఉన్నాము." అని మంత్రి కెటిఆర్ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో టై గ్లోబల్ సమ్మిట్ 2022 కో చైర్మన్ మురళి బుక్కపట్నం, టై హైదరాబాద్ ప్రెసిడెంట్ సురేష్ రాజు, ఐటి, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, అడోబ్ సిస్టమ్స్ సిఇఒ శాంతను నారాయన్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- సిఎం కెసిఆర్‌కు మందకృష్ణ మాదిగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. 2014, 2018 టిఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోల్లో జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు, దళిత బంధు తరహాలో జర్నలిస్టులందరికీ జర్నలిస్టు బంధును ప్రవేశపెట్టాలని కోరారు. దళిత బంధులో దళిత జర్నలిస్టులకు ప్రాధాన్యతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. చిన్న, పెద్ద పత్రికలు, హౌసింగ్ సొసైటీలో ఉన్నా, లేకపోయినా తేడా లేకుండా జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇండ్లు నిర్మించి మెగా జర్నలిస్టు కాలనీలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఇప్పటికే 16 రాష్ట్రాల్లో అమలు చేస్తున్న జర్నలిస్ట్ పెన్షన్ స్కీమ్‌ను రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టాలని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. సమాచారశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉండటంతో ప్రతి సందర్భంలో జర్నలిస్టు సంఘాలు సమస్యలను ప్రస్తావించడం కష్టంగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సమాచారశాఖ మంత్రిగా వేరే వారికి కేటాయించాలని సూచించారు.



సామాజిక మార్పుకు నాటకం మాధ్యమం

- మంత్రి శ్రీనివాస్ గౌడ్
- అభినయ జాతీయ నాటకోత్సవ్ ప్రారంభం

ప్రజాశక్తి - కల్చరల్

సమాజిక మార్పు కు ప్రజలను జాగృతం చేసేందుకు నాటకం మధ్యమమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం రవీంద్రభారతి ప్రధాన వేదిక పై రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, దక్షిణ ప్రాంత సంస్కృతిక కేంద్రం, కేంద్ర సంస్కృతిక శాఖల సౌజన్యంతో అభినయ థియేటర్ ట్రస్ట్ నిర్వహణలో అభినయ జాతీయ నాటకోత్సవ్ ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ గౌడ్ ఉత్సవాలు ఆరంభించి మాట్లాడారు. అభినయ సంస్థ తెలుగు నాటకంతో పాటు దేశంలోని ఇతర భాషా నాటకాలను ఒకే వేదిక పై ప్రదర్శనకు అవకాశం కల్పిస్తూ జాతీయ సమైక్యకు ప్రతీకగా నిలుపుతున్నారని అభినందించారు అధ్యక్షత వహించిన సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ భిన్నభాషా నాటకాల ప్రదర్శన వల్ల సాంకేతికంగా ఇతర ప్రాంతీయ నాటకాలలో వస్తున్న మార్పులపై ఇక్కడి రంగస్థల కళాకారులకు అవగాహన కలుగుతుందన్నారు. నిరాటకంగా అభినయ శ్రీనివాస్ వివిధ భాషా నాటకాల ప్రదర్శన్‌కు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రంగస్థల ప్రముఖులు తడక మల్ల రామచంద్రరావు బిఎం రెడ్డి, డాక్టర్ పద్మ ప్రియ పాల్గొన్నారు. అభినయ శ్రీనివాస్ తన నివేదికలో 16 ఏళ్ల వరుసగా జాతీయ నాట కోత్సవాలు జరుపుతున్నామని, అభినయ 65వ ఉత్సవాలు అని తెలిపారు. సభ అనంతరం మణిపూర్‌లోని ఇంఫాల్‌కు చెందిన ఖేంజోగలాంగ్ వారిచే డాక్టర్ తనింలేయమ రచించి దర్శకత్వం వహించిన రిక్షా అమసింగ్ నోగ్మి నాటకం ప్రదర్శించారు. పోయి రెయి అనే రిక్షా కార్మికుడు తన పొట్ట కూటి కోసం ఎంతో కష్టం తో రిక్షా తొక్కుకుని జీవనం సాగిస్తుంటాడు. అతను రిక్షా నడుపుతూ వీధుల్లో తిరిగే సమయంలో తన కంటే దుర్భర జీవితం చూసి తనకు తానే మానసిక ఆందోళన చెంది అయోమయ స్థితికి చేరుకొంటాడు. దీన జన విషాద గాథలకు అద్దం పట్టే విధంగా నాటకంలోని ప్రతి పాత్ర రక్తి కట్టించారు.



అనేక జబ్బులకు దోమలే కారణం

- ఆరోగ్య సమాజ నిర్మాణానికి శాస్త్రవేత్తలు మార్గాలు చూపాలి
- ఒయు విసి ప్రొఫెసర్ రవీందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్‌గున్యా సహా అనేక జబ్బులకు దోమలే కారణమని ఒయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ ఆందోళన వ్యక్తం చేశారు. దోమల నివారణ, ఆరోగ్య సమాజ నిర్మాణంలో జిహెచ్‌ఎంసి లాంటి సంస్థల ప్రణాళికలకు శాస్త్రవేత్తలు మార్గాలు చూపాలని కోరారు. ఒయు దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో ఒయు జంతుశాస్త్ర విభాగం, సొసైటీ ఆఫ్ ఆర్త్రోపొడాలజీ సంయుక్తంగా "మలేరియా, జూనోటిక్, వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణ - పరిశోధనలో సవాళ్లు, అవకాశాలు" అంశంపై మూడ్రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ 15వ అంతర్జాతీయ సదస్సును ఒయు విసి సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అత్యాధునిక సాంకేతికత వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చినా దోమలను నిర్మూలించే దిశగా ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇక ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో తెలంగాణ దూసుకుపోతోందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఏర్పడిన ఎనిమిదేళ్ల వ్యవధిలోనే వ్యవసాయం, సాగునీటి పారుదల తర్వాత వైద్య రంగంలో సంచలన విజయాలు సాధించిందన్నారు. కెసిఆర్ కిట్, గర్భిణులకు ఆరోగ్య సేవలు, పౌష్టికాహార లభ్యత కల్పించటం సహా జిల్లాల వారీగా వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చినట్లైందని స్పష్టం చేశారు. ఈ సదస్సులో సొసైటీ ఆఫ్ ఆర్త్రోపొడాలజీ అధ్యక్షులు ప్రొఫెసర్ బికె త్యాగి కీలకోపన్యాసం చేశారు. ఐసిఎంఆర్, విసిఆర్‌సి పుదుచ్చేరి మాజీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ దాస్, అమెరికాలోని మెచిగాన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కరీం ఎం మరిడియా, మలేషియాలోని మలయా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఇంద్ర వైతిలింగం, నేపాల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ నుంచి డాక్టర్ రోషన్ కుమార్, ఓయూ జీవశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎస్ జితేంద్ర కుమార్ నాయక్, ప్రొఫెసర్ బానోత్ రెడ్యానాయక్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ ప్రొఫెసర్ ఎం మాధవి, నాగేశ్వరరావు సహా ఇతర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు. పలువురు ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను సదస్సులో సమర్పించారు.

ఉచిత విద్యుత్ పథకం ఎల్‌టీ-4లోకి మార్చాలి

- రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రజకులకు ప్రమాద బీమా, ఉచిత విద్యుత్ పథకం ఎల్‌టీ 2 నుంచి ఎల్‌టీ4 లోకి చేర్చాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య, సహాయ కార్యదర్శి జ్యోతి ఉపేందర్, సి.మల్లేశం, బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు హైదరాబాద్‌లో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. మెదక్ జిల్లా కోనాయపల్లి, అల్లదుర్గం మండలం అప్పాజీపల్లి, రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం ప్రశాంతినగర్, మంచిర్యాల జిల్లా నర్సపూర్ మండలం,తళ్ళపల్లి మొదలగు ప్రాంతాల్లో చెరువుల్లో పడి ముగ్గురు రజక వృత్తి మహిళలు మరణించారని తెలిపారు. కరెంటు షాకుతో ఒక ఇస్త్రీ షాపు దగ్ధమైందనీ, విలువైన బట్టలు కాలిపోయాయని గుర్తుచేశారు. ఎక్కడో ఒకచోట కరెంటు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రూ:5లక్షల బీమా పథకం ఏర్పాటు చేయాలని కోరారు. ఉచిత విద్యుత్ పథకానికి సంబంధించిన ఎల్‌టీ 2, క్యాటగిరి ద్వారా కరెంటు బిల్లుల అధికంగా రావటంతో వృత్తిదారులనే బిల్లులు చెల్లించాలని కరెంటు అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు.ఎల్‌టీ 4 కు మార్పు చేసి అధనపు బిల్లు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

మళ్లీ పర్యాటకానికి ఊతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరోనా తర్వాత తిరిగి పర్యాటక, ఆతిథ్య రంగం పుంజుకుందని అక్బర్ ట్రావెల్స్ ఆఫ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సిఇఒ అమెయ్ ఆమ్లడి, వైస్ ప్రెసిడెంట్ ఉన్ని కృష్ణన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ అక్బర్ ట్రావెల్స్ 141వ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలు, రాష్ట్రాల్లో తమ కార్యాలయాలు ఉన్నందున అంతర్జాతీయ పర్యాటనకు అవసరమైన సౌకర్యాలను మెరుగ్గా అందించగలుగుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ ట్రావెల్స్ తెలంగాణ జనరల్ మేనేజర్ అనితాసింగ్ పాల్గొన్నారు.